క్లుప్తంగా

వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో ఇటీవల నిర్వహించిన బీసీ గర్జన సభలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలపై ఎమ్మెల్సీ మల్లన్న చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అజహర్ కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చివరి ఓసీ ముఖ్యమంత్రి అని, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో షేక్ సికిందర్, సంజీవ్, జాస్తి అమర్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న భేషరతుగా క్షమాపణ చెప్పాలని దళిత సంఘం జిల్లా నాయకుడు, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న జరిగిన బీసీ గర్జన సభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలను విమర్శించడం సరికాదన్నారు. పదవి కోసం పబ్బం గడుపుకునేందుకు అనేక వేషాలు వేసే మల్లన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో ఊర రామకృష్ణ, కత్తుల చిన్న, చినపంగ బబ్లు, యడవెల్లి వెంకటేష్, దైద కాశయ్య, శ్రీనివాస్, మందా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మహిళలు

మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు కలిగేలా కార్యక్రమాలు చేపడుతున్న గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అని పలువురు బీసీ మహిళలు కొనియాడారు. బుధవారం స్థానిక రాజీవ్ చౌక్ వద్ద బీసీ మహిళలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో దొనేటి రాధా, నాగలక్ష్మి, మణెమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి, సౌజన్య, మట్టమ్మ, పుల్లమ్మ, లింగమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ఆలయ నూతన కమిటీ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శాంతినగర్‌లో గల శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయం కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్, అధ్యక్షుడిగా గొల్లగోపు సాయిలు, ఉపాధ్యక్షులుగా గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, కంచుకట్ల శ్రీనివాస్, రాచూరి కిశోర్, ఉప్పల నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఇరువెంటి రవీందర్, సహాయ కార్యదర్శులుగా గుర్రం గోవర్ధన్, తోట శ్రీనివాస్, సకినాల వేలాద్రి, చిట్టిపోలు సీతారామయ్య, అలుగుబెల్లి మట్టయ్య, కోశాధికారిగా గొనుగుంట్ల జనార్దన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చామల సైదులు, తాళ్ల వెంకటేశ్వర్లుతో పాటు మరో 27 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఉదయ్ భాస్కర్, పొదిల శ్రీనివాస్, పొదిల వెంకన్న, అమృతం సత్యం, మందడి లక్ష్మమ్మ, జలగం వసంత, గార్లపాటి పావని, మందడి కవిత, సేవిత, విజయలక్ష్మి, శ్రవంతి, రమేష్, రాము, హరి, అరుణ, నాగయ్య, మాదవరావు, కళమ్మ, సైదాచారి పాల్గొన్నారు.

ఆయా పోస్టు ఎస్సీలకు కేటాయించాలని వినతి

పెద్దవూర: మండలంలోని తుంగతూర్తి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టును ఎస్సీలకు కేటాయించాలని బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓకు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వంగూరి కిరణ్‌కుమార్, సరిత, రేణుక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

త్రిపురారం : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు త్రిపురారం ఏఈ బాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని విద్యానగర్ కాలనీ, బెజ్జికల్, మర్రిగూడెం గ్రామాల వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- ఈ నెల 10న దేవరకొండ డిపో నుంచి ప్రారంభం కానున్న బస్సు సర్వీసులు
- ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



తిరుపతికి సూపర్ డీలక్స్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఆర్టీసీ అధికారులు (ఫైల్)

దేవరకొండ: తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఇప్పటికే అనేక వినూత్న కార్యక్రమాలతో ప్రయాణికులకు చేరువైంది. ఆర్టీసీ సంస్థ కార్గో ద్వారా సేవలు అందిస్తూ వస్తుంది.. ఎప్పటికప్పుడు సంస్థ ఉద్యోగులు, కార్మికుల సహకారంతో వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రయాణికుల ఆదరణ చూరగొంటుంది.గతంలో దేవరకొండ నుంచి తిరుపతికి నడిపిన బస్సు సర్వీసు గత 8నెలల కిందట నిలిచిపోయింది. అయితే దేవరకొండ ఆర్టీసీ అధికారులు ఉన్నతాధికారుల సూచనల మేరకు తాజాగా తిరుపతికి తిరిగి బస్సు సర్వీసును పునఃరుద్ధరించారు. కాగా, ఇప్పటికే దేవరకొండ డిపో నుంచి మద్దిమడుగుకు ప్రతి రోజు రెండు బస్సు సర్వీసులు నడుపుతుండగా ప్రతి ఏడు శ్రీరామ నవమి సందర్భంగా మూడు రోజుల పాటు నాగర్‌కర్నూలు జిల్లా శిరసనగండ్లకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు.అంతే కాకుండా డిపో నుంచి నెల్లూరు జిల్లా రహమతాబాద్‌కు హైదరాబాద్ నుంచి కొండమల్లేపల్లి మీదుగా బస్సు నడుపుతున్నారు.

దేవరకొండ డిపో నుంచి ప్రత్యేక డీలక్స్ బస్సులు

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచారామ క్షేత్రాలకు దేవరకొండ డిపో నుంచి ప్రత్యేక డీలక్స్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సన్నద్ధమయ్యారు.పంచారామ క్షేత్రాలైన అమరావతి,భీమవరం,పాలకొల్లు,ద్రాక్షారా మం, సామర్లకోట క్షేత్రాలకు ఈనెల 10,17,24 తేదీల్లో (ప్రతి ఆదివారం రాత్రి 8గంటలకు) దేవరకొండ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడవనున్నాయి. అంతే కాకుండా ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా 14వ తేదీ రాత్రి 8గంటలకు కూడా ప్రత్యేక బస్సులు నడుస్తాయి.13న తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సు సర్వీసులు తిప్పనున్నట్లు ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.వివరాలకు సెల్ :7382833031,7382833070 సంప్రదించాల ని అధికారులు సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రయాణికులు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.ఇప్పటికే దేవరకొండ డిపో నుంచి పలు పుణ్యక్షేత్రాలకు బస్సులు నడుపుతున్నాం.గతంలో తిరుపతికి వెళ్లే బస్సు నిలిచిపోయింది. ప్రస్తుతం డిపో నుంచి తిరుపతికి ప్రతి రోజూ సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడవనుంది.ఈనెల 10నుంచి నాలుగు రోజుల పాటు దేవరకొండ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపుతున్నాం .ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకునే వీలుంది.

– తల్లాడ రమేష్‌బాబు,డిపో మేనేజర్

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వసతులు కల్పించాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు పూర్తిస్థాయి వసతులు కల్పించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులకు సూచించారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఆయన ఆర్‌డబ్ల్యూఎస్,విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యుత్,తాగునీటి వసతి లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని లబ్ధిదారులు మంగళవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు.రానున్న పదిహేను రోజుల్లో ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఇవ్వడంతో పాటు తాగునీటి వసతి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పీడీ రాజ్‌కుమార్, ఈఈ హుస్సేన్, డీఈ విద్యాసాగర్, నగేష్, ఏడీఈ సైదులు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయిని మాధవరెడ్డి, నల్లగాసు జాన్‌యాదవ్, జాల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్

మిర్యాలగూడ: యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మినా మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓటరు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత ఓటును సక్రమంగా వినియోగించుకుని సుపరిపాలన అందించే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు తమ పరిసరాల్లో ఉన్న వ్యక్తులను కూడా చైతన్యం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాఘవరావు, తహసీల్దార్ హరిబాబు, ఎంఈఓ బాలు, మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య, డీటీ కల్పన, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనేలా చర్యలు తీసుకుంటాం

మిర్యాలగూడ: మహీంద్ర చింట్లు, 101 వరి సన్న రకం ధాన్యం రైస్ మిల్లర్లు, ఐకేపీ కేంద్రాల్లో కొనేలా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్లర్లు ఆ రకం ధాన్యం కొనడం లేదని రైతులు తన దృష్టికి తీసుకురాగా వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓలు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సన్న ధాన్యానికి షరతులు లేకుండా రూ.500 బోనస్ అందించాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సన్న ధాన్యాన్ని రైతులు కేవలం మిల్లుల వద్దనే అమ్మే అవకాశం ఉందని, ప్రభుత్వం ఐకేపీ కేంద్రాల్లో అమ్మిన వారికే బోనస్ ఇస్తామని మెలిక పెట్టడం మోసగించడమేనన్నారు. రైతు భరోసా ఎకరానికి రూ.7,500 ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం వానాకాలం సీజన్ ముగిసిపోతున్నా ఇంతవరకు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. వానాకాలంలో రైతులు పండించిన సన్న ధాన్యం మొత్తానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.2,310తోపాటు బోనస్ రూ.500 కలిపి రూ.2,810 చెల్లించాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, జగదష్, రవీందర్ ఉన్నారు.

అడ్‌హాక్ కమిటీ సభ్యుడిగా సైదులు గౌడ్

మిర్యాలగూడ టౌన్ : టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అడ్‌హాక్ కమిటీ సభ్యుడిగా పట్టణానికి చెందిన పొగుల సైదులును నియమిస్తూ ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియమక పత్రాన్ని ఆ పార్టీ నాయకులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధిగా ఎల్లేష్



ముదిగొండ ఎల్లేష్

డిండి: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ముదిగొండ ఎల్లేష్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మాదిగల సంక్షేమానికి కృషి చేస్తానని ఎల్లేష్ తెలిపారు.

చెకుముకి పోటీలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతాయి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, తదితరులు

మిర్యాలగూడ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పోటీలు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతాయని దామరచర్ల ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన చెకుముకి సంబురాలు -2024 పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నవంబర్ 7న పాఠశాల స్థాయిలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి మండల, జిలా, రాష్ట్ర స్థాయిలో పరీక్షలు నిర్వహించి ప్రతిభావంతులను ప్రోత్సహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బండా వెంకట్‌రెడ్డి, కోల శ్రీనివాస్, డి.వెంకటేశ్వర్లు, పులగం రాధిక తదితరులు పాల్గొన్నారు.

327యూనియన్ అధ్యక్షుడిగా ఆంజనేయులు

మిర్యాలగూడ: మిర్యాలగూడ డివిజన్ విద్యుత్ 327 యూనియన్ అధ్యక్షుడిగా ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సంఘం జిల్లా సెక్రటరీ ఎం.సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సెక్రటరీగా రాజేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కె.అబ్దుల్లాపాషా, కోశాధికారిగా పి.హరికిషన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అమర్‌కుమార్, జి.ముత్తయ్య, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, సత్తార్, పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి



జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్: కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. మత్స్యశాఖ జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ జలాశయంలో బుధవారం ఎమ్మెల్యే చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ, ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి చరితారెడ్డి, మత్స్యకారుల సహకారుల సంఘం చైర్మన్ రమణ, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దవూర మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, వినయ్‌రెడ్డి, మత్స్యశాఖ అధికారులు రఘుబాబు, శ్రీను, ప్రసాద్, రవి, రాజేష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

హాలియా : రాష్ట్రంలో రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం అనుముల మండలంలోని రామడుగు, తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఐకేపీ ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కలసాని చంద్రశేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కుందూరు వెంకట్ రెడ్డి, కృష్ణనాయక్, నాయకులు కాకునూరి నారాయణ గౌడ్, కుందూరు రాజేందర్‌రెడ్డి, గడ్డం సాగర్‌రెడ్డి, మేరావత్ మునినాయక్, ఉన్నారు.

చివరి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

పెద్దవూర: రైతులు పండించిన చివరి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారిణి చరితారెడ్డి, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ సరోజ పావని, ఎంపీడీఓ మానె ఉమాదేవి పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, పవన్, అనిల్, సునీల్, మహేష్, తరుణ్, కిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

- మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

మిర్యాలగూడ టౌన్ : ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యురేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ సూచించారు. బుధవారం సర్వేలో భాగంగా మొదటి రోజు ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రజలందరు ఇంటింటి సమగ్ర సర్వేకు అందరూ ఎన్యుమరేటర్లకు సహకరించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

పొరపాట్లకు తావులేకుండా సర్వే చేయాలి

ఇంటింటి సమగ్ర సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం పట్టణంలోని హనుమాన్‌పేట, ఎస్ఎస్‌పి క్యాంపు, శాంతినగర్‌లతో పాటు పలు ప్రాంతాల్లో ఇళ్ల స్టిక్కర్ల విధానాన్ని పరిశీలించి ఎన్యుమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అడవిదేవులపల్లి : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మొదటి రోజు ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీరాం సురేష్‌కుమార్, ఇంచార్జి ఎంపీడీఓ మోహసిన్ బిన్ అహ్మద్, దుర్గయ్య ఉన్నారు.

సర్వేకు సహకరించాలి

త్రిపురారం : కుల గణన సర్వేకు సహకరించాలని త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి అన్నారు. బుధవారం నిడమనూరు, త్రిపురారం మండలాల వ్యాప్తంగా గ్రామాల్లో కుల గణన సర్వే ప్రారంభమైంది. త్రిపురారం ఎంపీడీఓ విజయ కుమారి మండలంలోని దుగ్గెపల్లి గ్రామంలో సమగ్ర సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో అందరికీ సమన్యాయం

కుల గణన సర్వేతో ప్రతి ఒక్కరికీ సమన్యాయం లభిస్తుందని నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. బుధవారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సర్వే సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ముంగి శివ, మారయ్య, కొండ శ్రీనివాస్ రెడ్డి, నర్సింగ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ : సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ డానియల్

దేవరకొండ: ఇంటింటి సర్వే సమగ్రంగా చేయాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు. బుధవారం దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే గుర్తించిన ఇళ్లకు ఎన్యుమరేటర్లు స్టిక్కర్లు వేయడాన్ని ఆయన పరిశీలించారు.ఆయన వెంట మున్సిపల్ అధికారులు, తదితరులున్నారు.

కట్టకొమ్ముతండాలో:

దేవరకొండ మండల పరిధిలోని కట్టకొమ్ముతండా, కుంకుడుచెట్టుతండాలో బుధవారం ఇంటింటి సర్వేలో భాగంగా గుర్తించిన ఇళ్లకు స్టిక్కర్లు వేయడాన్ని బుధవారం దేవరకొండ ఎంపీడీఓ డానియల్ పరిశీలించి మాట్లాడారు.

వేములపల్లి: సమగ్ర కుటుంబ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ కోరారు. బుధవారం శెట్టిపాలెంలో సర్వేకు సంబంధించి ఇంటింటి స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ నాయక్, సైదులు, ప్రసన్న పాల్గొన్నారు.

మొదలైన సమగ్ర కుటుంబ సర్వే

కొండమల్లేపల్లి : కుల గణన సమగ్ర కుటుంబ సర్వే బుధవారం కొండమల్లేపల్లిలో ప్రారంభమైంది. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలో ఎన్యుమరేటర్లతో పాటు ఉద్యోగులు సర్వేలో పాల్గొని వివరాలు సేకరించారు. ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన బ్లాక్‌లో ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు.

ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాలి

పెద్దవూర: సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఇంటికి స్టిక్కర్ అతికించి ఇళ్ల జాబితాను తయారు చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీఓ) రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని బసిరెడ్డిపల్లిలో చేపడుతున్న కుటుంబ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మానె ఉమాదేవి, కార్యదర్శి రిక్కల శ్యాంసుందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ బోనస్ అందించాలి



మాట్లాడుతున్న మహబూబ్‌అలీ

మిర్యాలగూడ: సన్నరకం ధాన్యం అమ్ముకున్న రైతులందరికీ బోనస్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ మహబూబ్‌అలీ డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడారు. ఐకేపీల్లో సన్న రకం ధాన్యం అమ్ముకున్న రైతులకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అక్కడ తేమశాతం 17శాతం ఉండాలనే నిబంధన పెట్టడం వల్ల రైతులకు ఇబ్బందిగా మారిందన్నారు. సన్నరకం ధాన్యాన్ని ఐకేపీలో అమ్మేందుకు రైతులు ముందుకు రావడం లేదని, దీని వల్ల జనవరి నుంచి రేషన్‌షాపుల్లో తెల్లరేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం ఎలా అందిస్తారని ప్రశ్నించారు. సన్న బియ్యాన్ని కొనుగోలు చేసి పంపిణీ చేయాల్సి ఉంటుందని, ఇది ప్రభుత్వానికి ఎంతో భారమని చెప్పారు. ప్రభుత్వం ప్రణాళికతో సన్న రకం ధాన్యానికి బోనస్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో కిసాన్‌సెల్ నాయకులు వెంకటేష్‌గౌడ్, పల్లా వెంకటయ్య, కిరణ్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీలకు ఎంపిక



నందినిని అభినందిస్తున్న హెచ్ఎం నాగిరెడ్డి

వేములపల్లి(మాడ్గులపల్లి) : మాడ్గులపల్లి మండలం కన్నెకల్ గ్రామానికి చెందిన విద్యార్థిని సింగం నందిని రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సన్నూరి నాగిరెడ్డి తెలిపారు. ఈనెల 5న కనగల్ మండల కేంద్రంలో 68వ ఎస్‌జీఫ్ అండర్-19 విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సింగం నందిని మంచి ప్రతిభ చాటడంతో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 8న సికింద్రాబాద్ వెస్లీ జూనియర్ కళాశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో నందిని పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నందినిని బుధవారం వ్యాయామ ఉపాధ్యాయుడు యుగంధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రమేష్, శ్యామ్‌కుమార్, మల్లయ్య, సరస్వతి, అలివేలు, పృథ్వీరాజ్ అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెలవెల !

- రైస్ మిల్లుల్లోనే ధాన్యం అమ్ముకుంటున్న రైతులు
- తేమ శాతం అధికంగా ఉన్నా కొనుగోలు చేస్తున్న మిల్లర్లు



ధాన్యం రాక వెలవెలబోతున్న బాబుసాయిపేట పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం



బాబుసాయిపేట రోడ్డులోని రంగా రైస్ మిల్లు వద్ద బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

త్రిపురారం : గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు ముందుకు రావడంలేదు. త్రిపురారం మండల వ్యాప్తంగా అయా గ్రామాల్లో 95 శాతం మంది రైతులు వివిధ రకాల సన్న రకం వరి పంటలను సాగు చేశారు. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొనుగోలు కేంద్రాల్లో సన్న రకం ధాన్యాన్ని అమ్ముకున్న రైతులకు రూ.500 బోనస్ అందిస్తామని ప్రకటించింది. అయినా రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకరావడం లేదు. త్రిపురారం ప్రాథమిక సహకారం సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో బొర్రాయిపాలెం, రాగడప, అప్పలమ్మ గూడెం, చెన్నాయిపాలెం, బెజ్జికల్, త్రిపురారం, బడాయిగడ్డ తోపాటు బాబుసాయి పేట, పెద్దదేవులపల్లి పీఏసీఎస్, ఐకేపీల ఆధ్వర్యంలో మాటూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం రాలేదు. ధాన్యం రాకపోవడంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెల వెల బోతున్నాయి. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బోనస్ రాదు అని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

రైస్ మిల్లుల్లోనే ..

ప్రభుత్వం క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించి అందిస్తామంటున్న రైతులు ధాన్యాన్ని ఎక్కువగా రైస్ మిల్లులోనే అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాలంటే ధాన్యాన్ని ఆరబెట్టి 17 మ్యాచర్‌గా చూపించాలి. ఇది రైతులకు పెద్ద కష్టంగా మారింది. కూలీలు కూడా దొరకడంలేదు. అయితే పొలంలో నూర్పిడి చేసిన పచ్చి ధాన్యం 37 నుంచి 38 వరకు మ్యాచర్ ఉంటుంది. అయినా పచ్చి ధాన్యాన్ని రైస్ మిల్లుల్లో కొనుగోలు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితులు సైతం సహకరించకపోవడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకోవాలంటే ఇబ్బందులు ఉంటున్నాయని, పచ్చి ధాన్యాన్ని అందుబాటులో ఉన్న రైస్ మిల్లులకు తరలించి అమ్ముకుంటున్నారు. వరి ధాన్యాన్ని ఆరబెడితే నష్ట పోతున్నామని, పంట కోసిన వెంటనే పచ్చివి మిల్లుల్లో అమ్ముకోవడం సులభంగా ఉందని రైతులు అంటున్నారు.

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదు



పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు కేంద్రాలకు ధాన్యాన్ని తేవడంలేదు. 16 నుంచి 17 మ్యాచర్ ఉండాలనడంతో రైతులు ఆరబెట్టలేక మిల్లుల్లోనే అమ్ముకుటున్నారు. మరో 15 రోజుల్లో సాంబ మసూరి పంట వస్తే కేంద్రాలకు రావచ్చు. రూ. 500 బోనస్ కూడా అందిస్తాం.

– ధనావత్ జయరాం నాయక్, పీఏసీఎస్ చైర్మన్, త్రిపురారం

ధాన్యం ఆరబెడితే తూకం తగ్గుతుంది



మిల్లుల్లో పచ్చి ధాన్యం అమ్ముకునే వెసులుబాటు ఉంది. ప్రభుత్వం ఇచ్చే రూ. 500 బోనస్ కోసం ధాన్యం ఆరబెడితే తూకం చాలా తగ్గుతుంది. కూలీలు కూడా దొరకడంలేదు. రైస్ మిల్లుల్లో పచ్చి వడ్లు కొంటున్నారు. వాతావరణం కూడా ఏ సమయంలో ఎలా ఉంటుందో అర్థం కావడంలేదు. అందుకే కోసిన వెంటనే మిల్లుల్లో అమ్ముతున్నాం.

– నగిరి భిక్షమయ్య, రైతు, త్రిపురారం